క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్రా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో నిజామాబాద్ పాఠశాలకు చెందిన కార్తీక్, యూనస్, వర్ష, కల్యాణి అండర్–17 విభాగంలో ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు షాబొద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ అజయ్‌కుమార్ అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు..



స్పందన



మహాలక్ష్మి

బోయినపల్లి: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఈనెల 16నుంచి 18 వరకు జరిగే ఎస్జీఎఫ్ అండర్–17 బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విలాసాగర్ హైస్కూల్ విద్యార్థినులు సంపంగి స్పందన, రాపర్తి మహాలక్ష్మి ఎంపికైనట్లు హైస్కూల్ పీడీ పంతం ప్రభాకర్ సోమవారం తెలిపారు. ఈనెల 12న కొదురుపాకలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా జట్టులో స్పందన, మహలక్ష్మి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

రాజన్నకు జనహారతి



వేములవాడ: రాజన్నను సోమవారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా భీమన్నగుడికి దర్శనాలను మార్చినట్లు వచ్చిన కథనాలతో గత మూడు రోజులుగా భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. కోడెమొక్కులు, స్వామి వారి దర్శనాలు కొనసాగుతున్నాయి. భీమన్నగుడిలో ఆర్జిత సేవలు కొనసాగుతున్నాయి. భక్తుల ఏర్పాట్లను ఈవో రమాదేవి, ఇతర అధికారులు పరిశీలించారు. రాజన్నను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ మాజీ చైర్మన్ కొల్లేటి దామోదర్ దర్శించుకున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయండి



భీమేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: భీమన్న గుడిలో భక్తుల సౌకర్యాల పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. రాజన్న ఆలయాన్ని విస్తరిస్తుండడంతో భీమేశ్వరస్వామి ఆలయాన్ని బాలాలయంగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇక్కడ భక్తుల కోసం చేసిన సౌకర్యాలను సోమవారం పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈవో రమాదేవి, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, స్థానాచార్యులు ఉమేశ్‌శర్మ తదితరులు ఉన్నారు.

పరిహారం చెక్కు అందజేత

కోనరావుపేట: మండలంలోని కనగర్తికి చెందిన బడే స్వామిదాస్ అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. సెస్ నుంచి మంజూరైన రూ. 40 వేల చెక్కును స్వామిదాస్‌కు సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఏఈ దివ్య అందజేశారు. ఇక్కడ సెస్ ప్రతినిధులు సోలుపాటి బాపురెడ్డి, బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, కొమురయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్‌చ తిరుపతిరెడ్డి, జగన్, రాజు, వెంకటేశ్, చంద్రారెడ్డి, లైన్‌ఇన్‌స్పెక్టర్ వైకుంఠం తదితరులున్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలి

ఇల్లంతకుంట: జిల్లాకేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటీయూసీ అధ్యక్షులు అజ్జ వేణు అన్నారు. మండలంలోని పొత్తూరులో సోమవారం నిర్వహించిన జిల్లా హమాలీ సంఘం నాగులో మహాసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హమాలీలకు హెల్త్ కార్డులతో పాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 28న వేములవాడలో జరిగే ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, మల్లేశం, భూంరెడ్డి, రాజయ్య, శంకర్, జిల్లాలోని వివిధ మండలాల హమాలీ కార్మిక సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో వంట సామగ్రి చోరీ

ముస్తాబాద్: నామాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పాఠశాల వంటగదిలో ఉన్న సిలిండర్, వంట సామగ్రి, పాత్రలను దొంగలు ఎత్తుకెళ్లారని హెచ్‌ఎం సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సాగు..తున్న పాఠశాల భవనం

- గైదిగుట్ట తండాలో రూ.12.40కోట్లతో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల భవనం
- పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని భవనం
- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



గైదిగుట్ట తండాలో నిర్మిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల భవనం

రుద్రంగి: మండలంలోని మారుమూల గిరిజన తండా గ్రామాల నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు గత ప్రభుత్వం, అప్పటి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో గైదిగుట్ట తండాలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ గర్ల్స్ హైస్కూల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో పట్టించుకునే వారు లేక భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వేములవాడలో అద్దె భవనంలో అరకొర వసతులతో పాఠశాలను కొనసాగిస్తున్నారు. పాఠశాల భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ.12.40 కోట్లు మంజూరు.

మండలంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.12.40 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. అయితే మంజూరైన నిధులు సకాలంలో ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో భవన నిర్మాణ పనుల్లో ఆలస్యమవుతూ సర్కారు బడి అందుబాటులోకి రావడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

వసతులు లేక

వేములవాడలో నిర్వహిస్తున్న రుద్రంగి మండల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ బాలికల పాఠశాల అద్దె భవనంలో సరైన వసతులు లేకపోవడంతో గిరిజన విద్యార్థులకు ఇంటర్మీడియట్ కోర్సులను సైతం తొలగించినట్లు గిరిజనులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి గైదిగుట్ట తండా గ్రామంలో నిర్మిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

అద్దె భవనంలో అవస్థలు..

వేములవాడలో నిర్వహిస్తున్న పాఠశాల అద్దె భవనంలో కొనసాగడంతో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తల్లిదండ్రులు, గిరిజనులు ఆరోపిస్తున్నారు. గైదిగుట్ట తండాలో నిర్మిస్తున్న నూతన భవనం పూర్తయితే ఇబ్బందులు తప్పుతాయని వారు చెబుతున్నారు.

త్వరగా పూర్తిచేయాలి



మండల గిరిజన విద్యార్థుల కోసం గైదిగుట్ట తండాలో నిర్మిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని త్వరగా నిర్మించాలి. పాఠశాల భవనం పూర్తయితే విద్యార్థులకు ఇబ్బందులు తొలగుతాయి.

– దెగావత్ తిరుపతి నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, దెగావత్ తండా

అద్దె భవనంలో



వేములవాడలో నిర్వహిస్తున్న అద్దె భవనంలో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గైదిగుట్టలో నిర్మిస్తున్న స్కూల్ భవనాన్ని త్వరగా నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలి. గైదిగుట్ట తండా నుంచి స్కూల్ భవనం వరకు సీసీరోడ్డు వేయాలి.

– నరహరి నాయక్, సర్పంచ్ తండా

చివరిదశలో పనులు

మండలంలోని గైదిగుట్ట తండాలో నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– సిరిమల్ల మాధురి, ఏఈఈ, ట్రైబల్ వెల్ఫేర్, రుద్రంగి

ఆలయ అభివృద్ధిని అడ్డుకోవద్దు



సిరిసిల్ల: ప్రజాపాలన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోనరావుపేట: ప్రభుత్వ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్

సిరిసిల్ల: వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిని అడ్డుకోవద్దని, గత ప్రభుత్వం హామీలు ఇచ్చి నెరవేర్చలేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ అన్నారు. సిరిసిల్లలో సోమవారం ప్రజాపాలనకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ వేములవాడలో రోడ్ల విస్తరణ, ఆలయ అభివృద్ధి పనులు గతంలో ఎన్నడూ లేని విధంగా సాగుతుండగా అది చూసి ఓర్వలేక కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా కోడెమొక్కులను భీమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేశారని, రాజన్న ఉత్సవ మూర్తులను ప్రాణప్రతిష్ట చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారన్నారు. రాజన్న ఆలయాన్ని మూసివేయడం లేదని, అభివృద్ధి పనులుచేస్తున్నట్లు తెలిపారు. భీమేశ్వర ఆలయంలో రాజన్న ఉత్సవ మూర్తులను దర్శించుకుని తరిస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.150 కోట్లు కేటాయించారని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజన్న ఆలయ అభివృద్ధికి బాటలు పడుతున్నాయన్నారు. ప్రజాపాలన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, సూర దేవరాజు, బొప్ప దేవయ్య, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, రెడ్డి నాయక్, భైరి ప్రభాకర్, ముండ్రాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ప్రభుత్వ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ త లారి రాణి, బాల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రాజలింగం, బాలయ్య, రమేశ్, రాంరెడ్డి, దుబ్బాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాజన్న ఆలయాన్ని చిత్త శుద్ధితో అభివృద్ధి చేస్తుంటే కొందరు అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కోమిరిశెట్టి తిరుపతి, ఏఎంసీ చైర్ పర్సన్ విజయ, నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కోమిరిశెట్టి తిరుపతి ఏఎంసీ చైర్ పర్సన్ విజయ, నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకటి, రాజవీర్ తదితరులు పాల్గొన్నారు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోనీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోనీ మండెపల్లి చౌరస్తాలో ప్రభుత్వ చిహ్నానికి క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి, మునిగేలా రాజు, చుక్క రాజశేఖర్, లింగాల భూపతి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ఆలయాల పేరిట రాజకీయాలు చేయడం మానుకోవాలని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, నాయకులు చేపూరి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ వద్ద ప్రభుత్వ చిహ్నానికి క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు



సిరిసిల్ల టౌన్ : మాట్లాడుతున్న శ్రీకాంత్



వేములవాడ రూరల్: మాట్లాడుతున్న పరమేశ్

సిరిసిల్లటౌన్: రాజన్న ఆలయ అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదని, భక్తుల మనోభావాలు పరిగణలోకి తీసుకుని రాజన్న దర్శనం కల్పిస్తూనే అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల శ్రీకాంత్ ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిత్యం 50వేల మంది భక్తులు దర్శించుకునే రాజన్నను దర్శించుకుంటారని, అవసరమైతే రాజన్న క్షేత్రంలోనే ఆగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా బాలాలయాన్ని ప్రాణప్రతిష్ట చేసి భక్తులకు దర్శనం కల్పించాలన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని దుష్ప్రచారం చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీయాలని చూస్తే ఊరుకోబోమన్నారు. వేములవాడ పుణ్యక్షేత్ర ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మేన రాంప్రసాద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు వేముల వైశాలి, సురేశ్, మెరుగు శ్రీనివాస్, మోర శ్రీహరి, దూడం సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండల బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో రాజన్నను దూరం చేస్తారా అన్నారు. నాయకులు లింగంపల్లి శంకర్, సంజీవ రెడ్డి, మధు, భాను, దామోదర్‌రెడ్డి, మధు, మల్లేశం తదితరులు ఉన్నారు.

వేములవాడరూరల్: ఆలయ అభివృద్ధి పేరుతో రాజన్నను భక్తులకు దూరం చేస్తారా అని బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేశ్ అన్నారు. రూరల్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాజన్నను దర్శించుకుందామని వస్తే భీమన్న వద్దకు వెళ్లాలని చెప్పడం భక్తుల మనోభావాలు దెబ్బతీయడం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, ప్రధాన కార్యదర్శి శేఖర్, ఉపాధ్యక్షుడు పల్లికొండ నారాయణ, కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు నల్ల వెంకటరెడ్డి, లక్కం తిరుపతి, మారం రాజేందర్, మధు, వినోద్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సమావేశంను నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ లక్పతి మాట్లాడారు. బీజేపీ నాయకులు పిట్ల నాగరాజు, బండారి మహేశ్, ప్రకాష్, లింబద్రి, శ్రీను, వెంకట్, మోహన్, గోవర్దన్, తదితరులు పాల్గొన్నార

సంక్షిప్త వార్తలు

• 9న చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ

సిరిసిల్ల: భారత కమ్యూనిస్టు ఉద్యమకారుడు, గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నిర్మాత చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను నవంబర్ 9న సిరిసిల్లలో నిర్వహిస్తున్నట్లు ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం తెలిపారు. శాంతినగర్ వరలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో ఈ సభను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కెమిడి ఉప్పలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు వొల్లాల కిశోర్, రైకూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి బామండ్ల రవీందర్, బీడీ కార్మిక సంఘం నాయకురాలు మచ్చ అనసూర్యలు హాజరవుతారని పేర్కొన్నారు. నవంబరు 9న ఉదయం 10 గంటలకు కాలేజీ మైదానం నుంచి వరలక్ష్మీ ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ, 11 గంటలకు వర్ధంతిసభ నిర్వహించనున్నట్లు వివరించారు.

• రాజన్న ఆలయాన్ని పట్టించుకోలేదు

వేములవాడఅర్బన్: గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని వేములవాడ అర్బన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య అన్నారు. వేములవాడ నందికమాన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నేతలు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసినందుకు నిరసనగా ప్రభుత్వ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశామన్నారు.

• ఆర్థికసాయం అందజేత

సిరిసిల్ల క్రైం: జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన సుధాకర్ కుటుంబ సభ్యులకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.15వేలు ఆర్థికసాయంగా ఎస్పీ మహేశ్ బీగితే అందించారు. ఇక్కడ ఆర్ఐ యాదగిరి, సుధాకర్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

• నిరసన

గంభీరావుపేట: మండలంలోని నాగంపేటలో నల్ల బ్యాడ్జీలతో నాయకులు నిరసన తెలిపారు. సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

• ఎస్పీకి పూలమొక్క అందజేత

సిరిసిల్ల అర్బన్ : ఆర్‌ఎస్ హ్యూమన్ రైట్స్, అవినీతి నిరోధక సంస్థ జిల్లా అధ్యక్షుడు పోచవేని ఎల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీ మహేశ్ బీగితేను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో మాదక ద్రవ్యాలను నివారించి, ప్రైవేట్ కంపెనీల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాని ఎస్పీని కోరినట్లు వారు పేర్కొన్నారు.

• పీడీఎస్ బియ్యం పట్టివేత

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో అక్రమంగా నిల్వఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఉపేంద్రచారి తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం కొండాపూర్‌కు చెందిన బతుల సారయ్య పీడీఎస్ బియ్యాన్ని సేకరించి సరఫరా చేస్తుండగా పట్టుకుని 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్‌చేసి కేసు నమోదు చేశారు.

• తూకంలో మోసం

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరులో క్వింటాల్‌కు రూ.5,500కు ఓ వ్యాపారి పత్తి కొనుగోలు చేస్తూ మోసానికి పాల్పడుతున్నాడు. మిల్లు కంటే ఎక్కువ రేటు ఎలా చెల్లిస్తున్నాడనే అనుమానం రాగా తూకంలో తేడా రావడంతో వ్యాపారిని నిలదీశారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చేసరికే వ్యాపారి పారిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. పత్తి కొనుగోలు చేసే ప్రైవేటు వ్యాపారులను నమ్మకూడదని ఎస్సై అశోక్ సూచించారు

• రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట, రాచర్ల గొల్లపల్లి గ్రామాల మధ్య కారు, బైక్ ఢీకొనడంతో గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన శ్రీనివాస్, నర్సయ్య గాయపడ్డారు. క్షతగాత్రులను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

• గుడుంబా స్వాధీనం

వీర్నపల్లి: వన్‌పల్లి శంకర్‌నాయక్ తండాలో ఎస్సై లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీ చేశారు. కేలత్ రమేశ్, భూక్యా భూలి, కేలోత్ శంకర్ ఇళ్లలో గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లం పానకం స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్



బాకీ కార్డుల పంపిణీలో రవిశంకర్, తదితరులు

బోయినపల్లి: చెల్లని జీవోతో బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. బోయినిపల్లి కేంద్రంలో, కాంగ్రెస్ బాకీ కార్డులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బీఆర్‌ఎస్ నాయకులతో సోమవారం ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాజీ ఎంపీపీ సత్తినేని మాధవ్, నాయకులు గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాసరెడ్డి, కొనుకటి లచ్చిరెడ్డి, కొంకటి శేఖర్, తదితరులు ఉన్నారు.

చర్యలు చేపట్టాలి



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల క్రైం: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ఖబ్రస్తాన్ భూమిపై అక్రమంగా మసీదు నిర్మిస్తున్నారని.. దానిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఎస్పీ మహేశ్ బీగీతేకు సోమవారం ఫిర్యాదు చేశారు. ముస్లింల అంత్యక్రియల కోసం గత ప్రభుత్వ హయాంలో గుసూల్ ఖానా నిర్మించినా.. ఆ భవనంపై అనుమతులు లేకుండా మసీదు నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, గ్రంథాలయం, కోర్టులు, హనుమాన్ ఆలయం ఉన్న నేపథ్యంలో ఈ నిర్మాణం మత కల్లోలానికి దారితీయొచ్చని అభిప్రాయపడ్డారు. గతంలో కలెక్టర్ జోక్యంతో ఇలాంటి నిర్మాణాన్ని నిలిపివేశారని, మళ్లీ అక్రమంగా పనులు పునర్ ప్రారంభించారని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్, కైలాస్‌కుమార్ ఉన్నారు.

పురస్కారం అందజేత

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన సాంబారి ప్రదీప్‌కుమార్ స్మారకార్థం ఏటా ఇచ్చే జీవన సాఫల్య పురస్కారానికి ప్రముఖ కళాకారుడు, సీనియర్ రిథమ్ ప్యాడ్‌ప్లేయర్, వరంగల్‌కు చెందిన విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. సోమవారం గోపాల్‌నగర్ జంక్షన్‌లోని అనుశ్రీ బాంక్వెట్ హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ కళాకారులు ఎండీ సలీం, గుజ్జె నాందేవ్, జడల రమేశ్, ప్రవీణ్, రామచంద్రం, సాంబారి రాజు, ఎండి సత్తార్, సంతోష్, వాజిద్ హాజరయ్యారు.

పాఠశాల సందర్శన

తంగళ్లపల్లి: రామన్నపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి భూక్యా రాజు సందర్శించారు. పాఠశాల లోపరిసరాల పరిశుభ్రత, తరగతి గదులు, రికార్డులు పరిశీలించారు.

పోస్టర్ ఆవిష్కరణ

వీర్నపల్లి: మండలకేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్ యూనియన్ ఐదో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా నాయకులు సోమవారం ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, నాయకులు అరుణ్‌కుమార్ మాట్లాడారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

వేములవాడరూరల్: నాగాయపల్లికి చెందిన బండి దేవయ్యకు రూ.32,500, పోచెట్టిపల్లికి చెందిన గుండా మల్లేశ్‌కు రూ.21,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు అందజేశారు.

పొరుగు రాష్ట్రాల కార్మికులకు యారన్ సబ్సిడీ అందించాలి

- కలెక్టర్‌కు సీఐటీయూ నాయకుల వినతి



సిరిసిల్లలో ధర్నా చేస్తున్న పవర్‌లూమ్ కార్మికులు

సిరిసిల్ల: బతుకమ్మ చీరలు నేసిన పొరుగు రాష్ట్రాల కార్మికులకు పది శాతం యారన్ సబ్సిడీ అందించాలని కోరుతూ పవర్‌లూమ్ కార్మికులు సోమవారం ఆందోళన చేశారు. 2018 నుంచి 2022 వరకు బతుకమ్మ చీరలు నేసిన కార్మికులకు కూలీ సర్దుబాటులో భాగంగా పది శాతం యారన్ సబ్సిడీని ప్రభుత్వం చెల్లించిందని, 2023 నాటి సబ్సిడీని ఇవ్వకుండా.. పొరుగు రాష్ట్రాల కార్మికుల పొట్టలు కొడుతున్నారని జిల్లా పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోడం రమణ ఆరోపించారు. 2023 నాటి బతుకమ్మ చీరలకు సంబంధించి 400 మంది కార్మికులకు సుమారు రూ.కోటి మేరకు యారన్ సబ్సిడీ రావాల్సి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సిరిసిల్లలో పనిచేసిన పొరుగు రాష్ట్రాల కార్మికులకు యారన్ సబ్సిడీ డబ్బులు అందించాలని కోరారు. కలెక్టర్ హరిత, చేనేత, జౌళిశాఖ ఏడీ రాఘవరావుకు వినతిపత్రాలు అందించారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మూషం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జౌళిశాఖ ఆఫీస్‌ను తరలించాలి

బీ.వై.నగర్‌లో కొనసాగిన చేనేత, జౌళిశాఖ ఆఫీస్‌ను కలెక్టరేట్‌కు తరలించడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అదే భవనానికి తరలించాలని కోరుతూ కలెక్టర్ హరితకు సీఐటీయూ నాయకులు మూషం రమేశ్, కోడం రమణ వినతిపత్రం అందించారు. కార్మికులు కలెక్టరేట్ వరకు వచ్చి థ్రిఫ్ట్ ఫండ్ పథకం, చేనేత బీమా వంటి పథకాలను పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



తంగళ్లపల్లి: జిల్లెల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్

తంగళ్లపల్లి: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని నేరెళ్ల సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లెల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ నేరెళ్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో జిల్లెల్ల, నేరెళ్ల, చిన్నలింగాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగిల్‌విండో డైరెక్టర్లు అబ్బాడి అనిల్ రెడ్డి, రాజి రెడ్డి, గణేశ్ గౌడ్, రవీందర్ రావు, నారాయణ గౌడ్, పొన్నాల కిషన్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లింగారెడ్డి, రవి, శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.

గంభీరావుపేట: ముస్తఫానగర్, నాగంపేట గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, సీఈఓ రాజిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రుద్రంగి: మానాల రైతు వేదిక వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ చైర్మన్ ఎలేటి చిన్న రెడ్డి, నాయకులతో కలిసి రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్ రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్లు జక్కు లింగన్న, జూల భూమన్న, బానోత్ గంగాధర్, మాజీ వైస్ చైర్మన్ పిసరి చిన్న భూమన్న, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్‌పర్సన్ సవేరా బేగం కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి, సింగారం, ఎల్లారెడ్డిపేట, పదిర, హరిదాస్‌నగర్, అగ్రహారం, వెంకటపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తహసీల్దార్ సుజాత, వైస్‌చైర్మన్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో ప్రతిభ



ముస్తాబాద్: ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ పోటీల్లో ముస్తాబాద్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్–17లో పదో తరగతి విద్యార్థులు నీరటి హర్షిని, ఎండీ ఇర్ఫాన్ విజేతలుగా నిలిచారని ఎంఈవో రాజిరెడ్డి తెలిపారు. అండర్–14 పోటీల్లో ఏడో తరగతి విద్యార్థిని మనస్విని విజేతగా నిలిచారన్నారు. వీరిని జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు ఎంపిక చేశామన్నారు.

సభను విజయవంతం చేయాలి

కోనరావుపేట: గ్రామ పంచాయతీ కార్మికుల మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 24, 25 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల మహాసభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.